

# నేటి మనిషి

**- అగస్త్యప్రగడ హేమంత**

'ఏ స్వార్థమూ లేకుండా ఎవరూ ఎవరికీ ఏ సహాయమూ చెయ్యరు. ప్రతీ సహాయం, సానుభూతి వెనుక ఏదో ఓ స్వప్రయోజనం ఉండే తీరుతుంది'... అనుకుంటూ గట్టిగా నిట్టూర్చాడు శ్రీధర్. అతని బాధంతా స్వార్థంతో నిండిపోయిన లోకం గురించి కాదు. ఆ లోకంలో ఉన్న తన కొలీగ్ గురించీ, గుండె నెప్పితో హాస్పటల్‌లో చేరిన అతని తండ్రి గురించీనూ!

అంతకుముందు రోజు ఆఫీస్‌కి అందిన వార్తేవిటంటే, శ్రీధర్ కొలీగ్ తండ్రికి ఉన్న జబ్బుని బట్టి ఆయనకి ఓపెన్ హార్ట్‌సర్జరీ జరిగినా జరగచ్చుని! అది కాదు అసలు విషయం... జరిగితే అప్పుడు ఆఫీస్‌కి శలవు పెట్టేసి కొలీగ్ తోపాటు తనూ అతనికి తోడుగా హాస్పిటల్‌లో ఉండాలా? ఒద్దా! అన్నదే అతని సందిగ్ధం! ఈ ఆలోచనల్తోనే నిన్నట్నించీ తర్జన భర్జనలు పడుతున్నాడతను. ఇంకా పడుతూనే ఉన్నాడు.

ఆలోచిస్తూనే మరోసారి లాభనష్టాల్ని బేరీజు వేసుకున్నాడు. సదరు కొలీగ్ 'ఆఫీసర్'కి అభిమాన పాత్రుడు కూడాను. అంచేత అలాంటి వాడికి అవసరంలో ఉపయోగపడడం ఉత్తరోత్తరా తనకే లాభం!... అనిపించింది. కనుక వాళ్ళ నాన్నకి ఆపరేషన్ జరిగేరోజు తనూ అతన్తోపాటు హాస్పటల్‌లోనే ఉండాలని నిర్ణయించుకున్నాడు. అప్పుడు చాలా తేలిగ్గా అనిపించిందతనికి. హాయిగా నిట్టూర్చబోయే లోపు...'ధన్'మంటూ చప్పుడైంది. నిండు నీళ్ళబిందె ఎత్తు నుంచి నేలమీద పడ్డ శబ్దమది!

దిగ్గున కూర్చున్న చోటునుంచీ లేచి గుమ్మం దగ్గరకి ఒచ్చి బయటకి తొంగి చూశాడు. అక్కడ... పక్క ఫ్లాట్‌లో ఉండే అరుణ కిందపడి ఉంది. స్పృహలోనే ఉంది కానీ తనంతట తానుగా పైకి లేవలేక అవస్థపడుతోంది. ఆమెకి కొద్ది దూరంలో పడిపోయిన నీళ్ళబిందె! అరుణకి ఇంట్లో మంచినీళ్ళు అయిపోవడంవల్ల ఎదుటి ఫ్లాట్ వాళ్ల దగ్గర్నుంచీ బిందెడు నీళ్ల 'అప్పు'తీసుకెడుతూ కాలుజారి కిందపడిపోయిందన్న విషయం తెలియకనే తెలుస్తోంది. చూస్తున్న శ్రీధర్‌కి చప్పున కర్తవ్యం గుర్తొచ్చింది.

రెండంగల్లో హాల్లోంచి 'ఎగిరి'వంటింట్లోకి దూకాడు. అక్కడ సావకాశంగా కూచుని తాపీగా ఇడ్లీలు తింటోంది అతని భార్య శ్వేత. చటుక్కున ఆమె చేతిలోంచి ప్లేట్ లాక్కుని కిందపారేసి, భార్య జబ్బ పుచ్చుకుని పైకి లేపి, బరబరా సింక్ దగ్గరకి లాక్కుపోయాడు.

జరుగుతున్నదేమిటో శ్వేతకి సరిగ్గా అర్థంకాలేదు. "ఏవిటీ? ఏవైందీ?" అయోమయంగా అడిగింది.



"బయట అరుణ పడిపోయింది." ఆమె చేతిని టాప్‌కింద పెట్టి కడిగేస్తూ చెప్పాడు ఆతృతగా!

"బానే ఉంది వరస. ఆవిడ పడిపోతే దానికి మనమేం చేస్తాం?" తేలిగ్గా అనేసి మళ్ళీ ప్లేటు అందుకోబోయింది.

"అది కాదు. చెప్పేది సరిగ్గా విను. ఇవాళో రేపో మనకి గేస్ అయిపోతుంది. స్పేర్ సిలిండర్ కూడా లేదు. కనుక గేస్ అయిపోయిన వెంటనే మనకి సిలిండర్ ఇవ్వడమనేది ఒక్క అరుణకే సాధ్యం. రేపు ఆమెని మనం ఉపయోగించుకోవాలంటే ఇప్పుడు మనం ఆమెకి సహాయపడి తీరాలి. అంచేత వెంటనే వెళ్ళి అరుణని లేవదీసి ఇంట్లోకి తీస్కెళ్ళు." చెబుతూనే భార్య వీపు మీద రెండు చేతులూ వేసి మరీ ఆమెని బయటకి 'గెంటే'శాడు.

కాస్త లౌక్యం తెలిసింది కాబట్టి శ్వేత కూడా అతన్ని ఎక్కువ ఇబ్బంది పెట్టకుండానే ముందుక్కదిలింది.

ఆమెని పంపేదాకా అప్పుడు శ్రీధర్ ప్రాణం కుదుటపడింది. 'హమ్మయ్య!' అనుకుంటూ కుర్చీలో కూలబడబోయే లోపు గడియారం ఠంగున 'ఎనిమిది' కొట్టింది. ఆఫీస్‌కి టైమవుతోందన్న సంగతి గుర్తొచ్చింది. అదిరిపడి లేచి వంటింట్లోకి పరుగెత్తాడు. గబగబా అటూఇటూ వెదికి కేరేజీ గిన్నెలు తీసుకున్నాడు. ఇంకా ప్రెషర్ తగ్గని కుక్కర్‌ని బలవంతంగా పీకి గంజితో పసపసమంటున్న అన్నాన్ని గిన్నెల్లోకి సర్దుకున్నాడు. కూరకోసం చూస్తే ఎక్కడా కనపడలేదు.

ఆలోచిస్తుంటే అప్పుడు గుర్తొచ్చిందతనికి... "ఇంట్లో కూరలన్నీ అయిపోయాయి. ఒచ్చేటప్పుడు ఏవైనా కూరలు తెండి" అంటూ నిన్న ఉదయం ఆఫీస్‌కి వెళ్ళేటప్పుడే శ్వేత తనతో చెప్పిన విషయం. ఠప్పున నెత్తిమీద మొట్టుకున్నాడు. కూరలేని అన్నాన్ని ఎలా తీస్కెళ్ళాలో అర్థంకాక దాన్నలాగే ఒదిలేసి ఒచ్చి బట్టలు వేసుకోసాగాడు.

అప్పుడొచ్చింది శ్వేత! ఆమె చేతిలో ఏదో బాక్స్.

"ఏవిటిది?" అడిగాడు తల దువ్వుకుంటూ!

"కూర" వంటింట్లోకి దారితీస్తూ చెప్పింది.

"అరుణ ఇచ్చిందా?" ఆరా తీశాడు.

"కాదు. నేనే అడిగి పట్టుకొచ్చేశాను. మరి ఇంతసేపూ ఆవిడకోసం టైం కేటాయించినందుగ్గానూ ఏదో ఓ లాభం ఉండాలి కదా!" తను తెచ్చిన కూరని అన్నం గిన్నెల్లో వేసి వాటిని హాట్‌పేక్‌లో సర్దుతూ చెప్పింది.

"మొత్తానికి నువ్వు చాలా తెలివైందానివి" భార్యని మనస్ఫూర్తిగా మెచ్చుకున్నాడతను. "మరేవిటనుకున్నారు నేనంటే" హాట్‌పేక్ చేతికందిస్తూ గర్వంగా కళ్ళెగరేసిందామె.

భార్యకి వీడ్కోలు చెప్పి ఇంట్లోంచి బయటపడ్డాడు శ్రీధర్. బస్టాప్‌కి చేరుకుని బస్‌కోసం ఎదురుచూస్తుంటే 'మధు'కనిపించాడు. శ్రీధర్ ఆఫీస్‌లోనే పనిచేస్తాడతను. శ్రీధర్‌ది పైసీటు. మధుది మార్కెటింగ్ సెక్షన్‌లో చాలా కింది సీటు. ఆపైన మార్కెటింగ్ పుణ్యామాని ఆఫీస్ వాళ్ళు మధుకి స్కూటరిచ్చారు. దానిమీదే అతని రాకపోకలు జరుగుతాయి. ఇప్పుడూ అంతే! మధు స్కూటర్ మీద వెళిపోతూ బస్టాప్‌లో నిలబడి ఉన్న శ్రీధర్‌ని చూసి ఆగి పలకరించాడు.

"రండి! బండి మీద వెళిపోదాం!"అంటూ సాదరంగా ఆహ్వానించాడు కూడా!

ఆ పిలుపుకి శ్రీధర్ ఉబ్బిపోలేదు. "అవసరాలే మనుషుల్ని నడిపిస్తున్నాయి. అవసరానికి తను వడ్డీలేని అప్పులిచ్చి అప్పుడప్పుడూ మధుని ఆదుకుంటున్నాడు కనుకనే ఇవాళే అతను తన పట్ల ఇంత ఆదరణ చూపిస్తున్నాడు. అసలు తమని అవసరంలో ఎవరైతే ఆదుకుంటారో వాళ్ళని మాత్రమే ఆదరించి అక్కున చేర్చుకోవడం ఆనవాయితీగా మారిన రోజులివి. ఇక ఇందులో సంతోషించాల్సిందీ మధుని మెచ్చుకోవాల్సిందీ ఏం ఉంది?" అనుకున్నాడు.

అంతే తప్ప, తనూ ఆ కోవలోని వాడేననీ, కింది వాడు కదా ముమ్ముందు ఎందుకైనా పనికొస్తాడన్న దూరదృష్టితోనే తనూ అతనికి వడ్డీలేని అప్పు ఇస్తున్నాడన్న నిజాన్ని మాత్రం గుర్తుతెచ్చుకోలేకపోయాడు. అందుకే ఆఫీస్ రాగానే స్కూటర్ దిగి మామూలుగా వెళిపోయాడే తప్ప, తీసుకొచ్చిన మధుకి కనీసం 'థాంక్స్'అయినా చెప్పలేదు శ్రీధర్.

దిన చక్రంలో గంటలు క్షణాల్లా దొర్లిపోయాయి. ఐదు దగ్గర పడుతూంటే, అప్పుడు గుర్తొచ్చింది శ్రీధర్‌కి. ఇంటికి వెళ్ళేటప్పుడు నాలుగు రకాల కూరలు కొనుక్కుని

వెళ్ళాలని! టైమ్‌కంటే ఐదు నిమిషాల ముందే లేవాలని నిశ్చయించుకున్నాడు. ఫైల్స్ సర్దుకుని సీట్లోంచి లేవబోతుంటే టేబిల్ మీదున్న ఫోన్ రింగయింది. లిఫ్ట్ చేసి"హలో" అనగానే అవతల్నుంచి శ్వేత గొంతు వినిపించింది.

"రేపు మన కింది ఫ్లాట్‌లో ఉంటున్న వనజా వాళ్ళింట్లో సత్యనారాయణ వ్రతం. వాళ్ళు చుట్టాల్నీ పక్కాళ్ళనీ పిలుచుకున్నార్ట. మననీ పిల్చారు. పన్లోపనిగా... తను పీటల మీద కూర్చుంటుంది కాబట్టి ఆ కార్యక్రమం తాలూకు సగం బాధ్యతల్ని వనజ నాకే అప్పగించింది. మొన్నామధ్య మనింట్లో జరిగిన మేరేజ్ డే ఫంక్షన్ రోజున చాలావరకూ పనంతా తనే నెత్తిన వేసుకుంది కదా! ఇది దానికి బదులన్నమాట. ఇంతకీ చెప్పొచ్చేదేవిటంటే అంత చాకిరీ నేను చెయ్యలేను. అందుకే మా అక్కావాళ్ళింటికి వెళిపోతున్నాను. ఇంతక్రితమే మా అక్క ఫోన్ చేసిందని వనజతో అబద్ధం చెప్పేస్తాన్లెండి. ఒచ్చేటప్పుడు కూరలూ అవీ తేకండి. నేను మళ్ళీ రెండురోజుల్లో ఒచ్చేస్తాను." చెప్పేసి సమాధానంకోసం చూడకుండా ఠక్కున ఫోన్ పెట్టేసింది.

పెళ్ళాం తెలివితేటలకి మురిసిపోయాడు శ్రీధర్. "నిజమే! చేయించుకోవడం మన హక్కు. చెయ్యడం వాళ్ళ బాధ్యత. అలా ఉంటేనే ఈరోజుల్లో బతగ్గలం. ఏదేమైనా శ్వేత చాలా తెలివైంది. ఆమెకి తను ఏ విషయమూ పనిగట్టుకుని చెప్పక్కర్లేదు" అనుకున్నాడు. ఆలోచనల్లోంచి బయటపడి ఆఫీస్‌నుంచి ఇంటిముఖం పట్టాడు.

అతను గుమ్మంలోకి రాగానే అటు పక్క ఫ్లాట్‌లో ఉండే సావిత్రి పరుగెత్తుకొచ్చింది. ఆమెని చూస్తూనే విసుగ్గా ముఖం చిట్లించాడతను. కారణం ఒకటే! సావిత్రి భర్త పెద్ద సంపాదన పరుడు కాదు. అయినా పైసాపైసా పోగేసి ఎలాగో ఒకలా ఓ సింగిల్ బెడ్ రూమ్ ఫ్లాట్ కొన్నాడు. దానికి పెట్టిన లోన్ ఇతరత్రా కటింగ్స్ పోను అతని జీతం ఐదువేలు మించి రాదు. ఆపైన సావిత్రి కూడా ఏదో స్కూల్లో టీచర్‌గా చేస్తోంది. క్రెడిట్ కార్డ్ లాంటి వాటి మాట దేవుడెరుగు వాళ్ళింట్లో కలర్ టి.వి. కూడా లేదు. అలాంటివాళ్ళు తమకి ఏ విధంగానూ పనికిరారు కనుక వాళ్ళంటే అతనికి విసుగు.

శ్రీధర్ మొహంలోని చిరాకు గమనించి బెదురుగా ఒక్కడుగు వెనక్కి వేసింది సావిత్రి. "మీ ఆవిడ తాళం ఇచ్చారు." చెప్పేసి ఇంటి తాళం అతనికి అందించేసి వెళిపోయింది. అసహనంగానే తాళం తీసి లోపలికి అడుగుపెట్టాడు శ్రీధర్. సాదాసీదాగా ఉండే సావిత్రిని చూసేసరికి అతని మూడ్ పాడైపోయింది. బట్టలు మార్చుకుంటుంటే మళ్ళీ ఎవరో తలుపుతట్టిన చప్పుడైంది. హఠాత్తుగా అరుణ గుర్తొచ్చిందతనికి. ఏ సిలిండరో ఇవ్వడానికే ఒచ్చుంటుందేమోననిపించింది. మొహాన ఇంత చిర్నవ్వు పులుముకుని వెళ్ళి తలుపు తీశాడు.

అతని అంచనాల్ని తారుమారుచేస్తూ, ఎదురుగా సావిత్రి నిలబడి ఉంది. ఆమె చేతిలో కాఫీ గ్లాసు. కానీ ఆమెని చూడగానే అతని మొహంలో 'నవ్వు'మాయమైంది. "కాఫీ తీసుకోండి" అతని హావభావాల్ని పట్టించుకోకుండా గడప అవతల్నుంచే గ్లాసుని అందించిందామె.

చప్పున గ్లాసందుకున్నాడతను. పనైపోగానే ఆమె మొహంమీదే ఠక్కున తలుపేశాడు. ఆ వెంటనే చేతిలో ఉన్న గ్లాసు మీదకి దృష్టిసారించాడు. దాంట్లో 'బ్రూ'కాఫీ ఘుమ ఘుమలాడిపోతోంది. ఆత్రంగా దాన్ని లాగించేశాడు. గ్లాసులో మిగిలిన ఆఖరి బొట్టుని కూడా ఆబగా తాగుతుంటే మళ్ళీ సావిత్రి గుర్తొచ్చింది. "అసలీ రోజుల్లో ప్రయోజనం లేని పరిచయాలూ, లాభం లేని పలకరింపులూ లేనే లేవు. ఇప్పుడీ సావిత్రి ఇంత చక్కటి కాఫీ తెచ్చి ఇచ్చిందంటే ఉత్తరోత్తరా ఆమెకి తమలో ఏదో అవసరం ఉండే ఉంటుంది" అనుకున్నాడు. అలా అనుకుంటున్నప్పుడే మళ్ళీ తలుపు చప్పుడైంది. తీసి చూస్తే... మళ్ళీ సావిత్రే! ఈసారి ఆమె చేతిలో ప్లేటు, దాంట్లో ఊతప్పం, చట్నీ అన్నీ!

"ఒదినగారు వెడుతూవెడుతూ మీ గురించి చెప్పి మరీ వెళ్ళారు. అందుకే ఇవన్నీ" అతను అడక్కుండానే చెప్పేసి, టిఫిన్ ప్లేటుని అక్కడే ఉన్న టీపాయ్ మీద పెట్టేసి వెళిపోయింది.

సావిత్రి వేసిన ఊతప్పం ఎంత బావున్నా శ్వేతకి ఆమె 'ఒదిన'వరస కలపడమే అతనికి మంటెక్కించింది. 'ముందుముందు ఎంత పెద్ద అవసరముందో ఇలా కాకాపడుతోంది'... అనుకున్నాడు. అలా అనుకుంటూంటే కడుపులో భగ్గుమంది. ఆపైన గుండెలో కలుక్కుమని కూడా అంది. అందుక్కారణం సావిత్రి కాదు. ఎప్పట్నుంచో శ్రీధర్‌కి ఉన్న ఎసిడిటీ!



ఒకప్పుడు కేవలం అవసరంకోసమే బంధుమిత్రులు అన్న అతనే, ఈరోజు అవసరార్థం తన దగ్గరకి చేరి, దూరమైపోతున్న వాళ్ళని ద్రోహులంటూ విశ్వాస ఘాతకులంటూ ద్వేషించి దూషిస్తున్నాడు. అలా చుట్టూ ఉన్న వాళ్ళలో దోషాల్నే చూస్తూ, మానవత్వం చచ్చిపోతోందని గోల పెడుతున్నాడు.

అరగంట గడిచేసరికి దాని ప్రభావం మరింత ఎక్కువై ఛాతీలో సూదులు గుచ్చుతున్నట్టనిపించసాగింది. అది ఎసిడిటీయే అని తెలిసినా హార్టెటాకేమో అన్నంతగా బెదిరిపోతాడతను. ఇప్పుడూ అదే జరిగింది. పక్కన భార్య లేకపోవడంతో ఆ భీతి మరింత ఎక్కువైంది. 'వెళ్ళి ఎవరింట్లోనైనా కూర్చోవడం మంచిది... అంతగా తనకేదైనా అయితే అంతా వాళ్ళే చూసుకుంటారు' అనిపించింది. ఆలోచన రావడమే ఆలస్యం. అరుణా వాళ్ళ ఫ్లాట్ వైపు దారితీశాడు. వెళ్ళి చూసేసరికి తాళం వేలాడుతూ కనిపించింది. ఇంకా చుట్టూ చాలామంది ఉన్నా కావాలనే వాళ్ళతో పరిచయాలు పెంచుకోలేదతను. ఏంచెయ్యాలో అర్థంకాక దిక్కులు చూస్తున్న సమయంలో మళ్ళీ సావిత్రి గుర్తొచ్చింది. అంతే! గబగబా అటు నడిచాడు.

అతను వెళ్ళేసరికి సావిత్రి భర్త అప్పుడే ఆఫీస్ నుంచి ఒచ్చినట్టున్నాడు కాఫీ తాగుతున్నాడు. గుమ్మంలోకొచ్చిన శ్రీధర్‌ని ఆదరంగా ఆహ్వానించాడు. సావిత్రి కమ్మటి మజ్జిగ తెచ్చి అతనికిచ్చింది. సరిగ్గా పావుగంట తర్వాత శ్రీధర్‌కి 'కడుపు మంట' నెమ్మదించింది. సావిత్రి దంపతుల దగ్గర శలవు తీసుకుని తేలికపడ్డ మనసుతో ఇంటికి తిరిగి ఒచ్చేశాడు శ్రీధర్.

రెండురోజుల తర్వాత శ్వేత తన అక్క ఇంటి దగ్గర్నుంచీ తిరిగొచ్చేసింది. ఈ రెండురోజుల్లోనూ కాఫీలూ, టిఫిన్లూ, అన్నంలోకి ఆధరువులూ అన్నీ శ్రీధర్‌కి సావిత్రి ఇంటినుంచే వచ్చాయి. తనకే కాదు, తండ్రి ఆపరేషన్‌కోసం హాస్పటల్లో ఉన్న తన కొలీగ్‌కి కూడా అతను సావిత్రి ఇంటినుంచే లీటర్ల కొద్దీ కాఫీలు మోసుకెళ్ళాడు కూడా! అప్పుడే ఓసారి... "మిమ్మల్ని ఇబ్బంది పెట్టేస్తున్నాను"అన్నాడు మాట వరసకి.

"ఇందులో ఇబ్బందేం లేదు. అసలు సహాయమంటే ఆపదలో, అవసరంలో ఉన్నప్పుడు ఆదుకోవడం... అంతేగానీ మనకి అవకాశం ఉన్నప్పుడు చేసేది కాదు"అంది సావిత్రి. అయినా సరే ఆమె చేతల పట్ల అతనికి సదభిప్రాయం కలగలేదు. అందుకే భార్య రాగానే సావిత్రి గురించి అంతా వివరించాడు. "ప్రతిఫలం ఆశించని పరోపకారాన్ని ఎవరూ చెయ్యరు. ఒకవేళ చేశారూ అంటే ఇంతకు రెట్టింపు తీసుకునే ప్రయత్నం చేస్తారనే అర్థం. అంచేత సావిత్రిని కాస్త దూరంగా ఉంచు" అంటూ భార్యకి హితబోధ చేశాడు కూడా! పైకి చెప్పలేదు కానీ ఇంచుమించు శ్వేత అభిప్రాయం కూడా అదే!

ఆ తర్వాత... ఓసారి సావిత్రి వంటింట్లో కళ్ళు తిరిగి పడిపోయింది. మరోసారి ఆమె భర్తకి చిన్న యాక్సిడెంట్. ఇంకోసారి వాళ్ళ పిల్ల ఒళ్ళెరగనంత జ్వరంతో నాలుగు రోజులు హాస్పటల్‌లో ఉంది. ఇన్ని జరిగినా ఏ సందర్భంలోనూ శ్రీధర్ దంపతులు సావిత్రి కుటుంబానికి సహాయం కానీ సానుభూతి కానీ అందించలేకపోయారు.

శ్రీధర్ దంపతులు తమని దూరంగా ఉంచినా, దగ్గరకి చేరదీసినా సావిత్రి కుటుంబ సభ్యుల్లో మార్పేంరాలేదు. ఏనాడూ శ్రీధర్ కుటుంబంనుంచి వాళ్ళు ప్రత్యుపకారాన్ని ఆశించలేదు కూడా! మరి కొన్ని రోజులు అలాగే గడిచిపోయాయి. ఇంతలో ఆర్థిక ఇబ్బందుల్ని తట్టుకునేందుగ్గానూ తాము ఉంటున్న ఫ్లాట్‌ని అద్దెకిచ్చేసి తాము మరో చిన్న పోర్షన్‌లోకి మారిపోయారు సావిత్రివాళ్ళు. ఈ మార్పుకి మొదట సంతోషించిన వాళ్ళు శ్రీధర్ అతని భార్య శ్వేత!

కాలగర్భంలో రోజులు కలిసిపోతున్నాయి. శ్రీధర్ ఎప్పట్లాగే అవసరాన్నిబట్టి మనుషుల్ని చేరదియ్యడం, దూరం చెయ్యడం చేస్తున్నాడు. ప్రతిఫలాపేక్ష లేకుండా సహాయ పడేవాళ్ళని యధాశక్తి అనుమానిస్తూనే ఉన్నాడు. క్రమంగా అతనేవిటో అతని స్వభావం ఏవిటో చాలామందికి తెలిసిపోయింది. అతనితో తమకి అవసరాలేవీ లేవనుకున్నవాళ్ళు శ్రీధర్‌ని దూరంగా ఉంచేశారు. పనులున్నాయి అనుకున్నవాళ్ళు అప్పుడప్పుడూ అతన్ని కలుస్తున్నారు.

అయితే అప్పటికీ ఇప్పటికీ అతన్లో ఒచ్చిన మార్పు ఒకటే! ఒకప్పుడు చుట్టాల్నీ చుట్టుపక్కల వాళ్ళనీ అవసరానికి వినియోగించుకుని అదయ్యాకా అవతలికి విసిరేసేవాడు, అదీ చాలా నిర్దాక్షిణ్యంగా! తన విషయంలో ఎవరైనా అదే విధంగా వ్యవహరించినా కూడా పట్టించుకునేవాడు కాదు.

కానీ ఇప్పుడలా కాదు. అతనికీ కుటుంబం పెరిగింది. ఖర్చులు పెరిగాయి. ఆర్థిక ఇబ్బందులు ఎక్కువయ్యాయి. ఆర్థికంగా రెండు మెట్లు కిందకి దిగిన అతన్ని కొంత మంది ఎందుకూ పనికిరాని వాడుగానే భావించి కొంచెం దూరంగా ఉంచేశారు. ఆపైన వయసు ముదిరి, ఓపిక తగ్గడంతో సమయానుకూలంగా స్పందించి తమకి సహాయం చెయ్యలేకపోతున్న అతన్ని మరికొందరు దూరంగా ఉంచేశారు. అలా క్రమంగా శ్రీధర్‌కి సహాయం చేసే వాళ్ళ సంఖ్య తగ్గిపోయింది.

ఒకప్పుడు కేవలం అవసరంకోసమే బంధుమిత్రులు అన్న అతనే, ఈరోజు అవసరార్థం తన దగ్గరకి చేరి, దూరమైపోతున్న వాళ్ళని ద్రోహులంటూ విశ్వాస ఘాతకులంటూ ద్వేషించి దూషిస్తున్నాడు. అలా చుట్టూ ఉన్న వాళ్ళలో దోషాల్నే చూస్తూ, మానవత్వం చచ్చిపోతోందని గోల పెడుతూ, అసలు ఒకప్పుడు ఎదుటివాళ్ళ పట్ల తను ఎలా వ్యవహరించిందీ మర్చిపోయి మరీ రోజులు నెట్టేస్తున్నాడు.

ఔను డబ్బు, హోదా, అవసరాలు, విలాసాల్లాంటి నిచ్చెన మెట్లెక్కుతూ అసలు మానవత్వాన్నే కాదు... తనని తానే మర్చిపోయి కాలప్రవాహంలో కొట్టుకుపోతున్న "నేటి మనిషి!" ★